# శివుడు

## — రామా చంద్రమౌళి

పన్నెండేండ్ల శివుని ఒళ్ళు మసిపట్టిన మట్టికుండ రంగులో మిలమిలా మెరుస్తోంది.

వాని ఒంటిపై చొక్కా లేదు. నెత్తికి నూనె లేదు కాళ్ళకు చెప్పులు లేవు తింటానికి తిండిలేదు - మొలలో పిర్రలు చిరిగిన ఓ పెద్ద సైజు నిక్కరుంది

వాడు ఊరి చివరి తాటి తోపులో కాళ్ళు నిక్కించి బాల సైనికునిలా నిలబడి దీక్షగా తాడిచెట్ల వెనుక మెరుస్తూ కనబడే తారు రోడ్డు వంక చూస్తున్నాడు పట్టపగలు.... విసురుగా వచ్చిన వడగాలి వాని దవడలు వాయించి వెళ్ళిపోయింది. గాలికి కనురెప్పలను మిటకరించి. మళ్ళీ తదేకంగా అటే చూస్తున్నాడు

వాని జుట్టులోనుండి చెమట ధారగా కిణ తలపై నుండి కారి.... రోడ్డుపైనుంచి లారీ యింకా రావట్లేదు

"యింకెప్పుడ్రా వచ్చేదీ లారీ...." అని గొణిగేరెవరో వెనుకఉన్న మందిలోంచి తుపుక్కున వుమ్మేసి మళ్ళీ చుట్టను నోట్లో పెట్టుకుంటూ.

"వస్తది వస్తది - గట్ల తొందరపడ్తె ఎట్లరో ఏల మంది ఎవ్వాగం వందల లారీల తంతు.... అంతా భారీ పనాయె మరి" సర్పంచ్ సత్తెం గొంతు

శివుడు చూడ్డం మాని వెనక్కి తిరిగి సర్పంచ్ వంక చూశాడు

అతను నిలబడి వున్నాడు ...చుట్టూ ఊళ్ళో నుండి కిరాయికోసం వెళ్ళాల్సిన జనం కావడి చుట్టూ అమాయకపు గొర్రెలా కూర్చుని....

"అరేయ్ ... యీలోగా మీకు మీరు పట్నం పోంగనే ఏమేం చెయ్యాల్నో చెప్తా మంచిగినుండ్లి.... యిన్నగా–"

"ఆఁ ... చెప్పండి"

"యిప్పుడు లారత్తది గద. రాంగనే ఆ వచ్చినోడు నాకు పైకమిస్తడు నేను అవి తీస్కొని మీకు మనిషి రొండ్రూపాలిస్త. ఎంటనే మీరా లారీల ఎక్కాలె అర్ధగంటల మిమ్ముల్ని పట్నం తీస్కపోద్దది పోంగనే ఒక పేద్ద దొడ్లె మిమ్ముల్ని దింపుతారు. అప్పటికే అడ మీలెక్కనే ఎన్నెన్నో ఊర్లల్లకెళ్ళొచ్చిన జనం వేల మందుంటరు యిగ మీ కిందరికి టిఫిన్లు పెడ్తరు మీరు మంచిగా కడుపునిండ తినాలె. తిన్నంక మీకు పట్టుకుంటాన్కి రాతలు రాసిన అట్టలిస్తరు పట్కోవాలె"

"వాటిమీద ఏం రాసుంటది పటేలా"

"ఏం రాసుంటేందిరా పట్కోమంటె పట్కో గంతె. నడువ్ మంటరు లైన నడ్వుండ్లి. అందకెళ్ళి ఒకడేదో బర్తడు వాడట్ల బర్తే మీరేమని ఒర్రాల్నో ముందుగనే మీకు చెప్పరు గట్లనే ఒర్రుండ్లి. ఐపాయె"

"అచెంక"

"మీరు ఊరేగింపుల నడిచి సంక ఓ కాడ మైదాన అందరూ కూకోవాలె. ఎవరో మాట్లాడ్తరు. మీరు వినాలె అప్పుడప్పుడు సప్పట్లు కొట్టాలె మీటింగైపోంగనే సంక మీకు మల్ల మనిషికి రొండ్రూపాలిస్తరు తీస్కొని అదే లారెక్కి మనూరు రాండ్లి - ఐపోయె"

"మరి నువ్వస్తవా మాతోటి-" శివుని ప్రశ్న.

"నేనెందుకురా నేరాను"

"మరి మమ్ముల్ని పంపి నువ్ రానందుకు నీకెన్ని రూపాలిస్తర్"

"అరే శివా - గవన్ని నీకెందుకురా.... చెప్పింది చెయ్రా బాగుపడ్తవ్" అని అంటూండగానే

డడడడ్ .. డ్.... డ్ ... డ్—

లారీ చప్పుడు వినబడ్తూ ...

అందరూ అటుచూశారు లారీ దుమ్ము రేపుకుంటూ మూసుకొస్తోంది వచ్చివచ్చి ఆగి.

అందులోనుండి ఓ ఏనుగు గున్నలాంటి మనిషిదిగి - సర్పంచ్ నడిగి తెలుసుకుని చేతిలోని బ్యాగ్‌లోనుండి ఒక కొత్త రెండ్రూపాయలనోట్ల కట్లను అందించాడు.

వెంటనే - కట్ల తెగి -

సర్పంచ్ ఒక్కో నోటును ఒక్కో మనిషికి యిచ్చి

"ఎక్కండ్లిగా దబదబ .. జల్ది జల్ది-"

శివుని చేతికి నోటు అంది-.

నోటువంక పరిశీలనగా చూచి ... కారుతున్న చెమటను చిమ్మి.... పరుగుతీశాడు-

పరుగు .. పరుగు....

ఎండలో.... కాలే భూమిపై బోసి పాదాలలో ... వీచే వడగాలి నడుమ

బొజ్జల వ్యక్తి.... చటుక్కున ఒంటిపైచొక్కా లేని శివునివంక అసహ్యంగా ఉగ్రంగా చూచి - కసిగా కాగితాన్ని చాతీపై నున్న తోలుపై ఉంచి గుండుసూదితో గుచ్చి - క్షణంలో పదోవంతు కాలంలో - గుండుసూది చర్మంలో నుండి చొచ్చుకుని దిగింది. అమ్మాఅని అరిచాడు శివుడు.

ఉరికి ఉరికి—కూలిపోబోతున్న గుడిసె ముందాగి.... "అవ్వా.... అవ్వా—" అని అరిచి.... వాకిట్లో ఊగిపోతూ.... మోసపోస్తూ- లోపలినుండి ఓ చీకిపోయిన మనిషి బయటికొచ్చి—

"యింగో నే... పీటిని తీస్కోని బువ్వ వండు నేను రాత్రికాస్త" అని వినుదిరిగి-

"అరేయ్—ఎట్టా ... శివా .."

శివుడు ఆమె మాటలు వినలేదు పరుగెత్తుతూనే ఉన్నాడు లారీ దిక్కు.

అప్పటికే లారీనిండా జనం ఎక్కారు

వచ్చిన శివున్ని "ఎటు పోయావుగా లంజా కొడ్క ఒకదిక్కు ఆలస్యమైతాందంటే.... నడు నడు .."

శివుడు చకచకా ఎక్కాడు

లారీ కదిలింది

దుమ్ములో నుండి యికిలిస్తూ కనిపిస్తున్న సర్పంచ్ చేతిలో మిగిలిన రెండ్రూపాయల నోట్ల కట్ట ...

శివునికి ఎంతో సంబరంగా వుంది లారీ ప్రయాణం విమాన ప్రయాణంలా. పరిగెత్తుతున్న చెట్లనూ, గుట్టలనూ, గట్లనూ చూస్తున్నాడు.

ఎన్నో రోజుల తర్వాత.... రెండ్రూపాయలు....

వారానికి నాల్గురోజులు పస్తులుండే అవ్వ.... తను....

ఇవ్వాల.... అవ్వ బువ్వ తింటుంది—


తను "టిపిని.... టిపిని.... టిపిని పెత్తర టక్కడు"

లోపల ఏదో ఉత్సాహం....

పడిగాలికూడా ఎంతో ఆనందంగా తోస్తోంది శివునికి.

* * *

"దిగుండ్లి.... దిగుండ్రి .... దిగి అగో.... గాములకు కూర్చున్నాయన దగ్గరకు వెళ్ళండి— పోండి దబ్బున"



అతను చూపించినచోట ఒక వ్యక్తి చిన్న బల్లపై కూర్చుని.... అతని ప్రక్క గోడకు ఏవేవో అటలు- వాటిపై ఎన్నెన్నో గాతలు....

"వాటిని పట్టుకుంటే బాగుండు-"

నడుస్తున్నాడు శివుడు

అక్కడే యింకో మనిషి ప్రక్కన గిన్నె.

దగ్గరకి పోగానే ఒక కాగితంలో గంపెడు వుప్మాను టపుక్కునవేసి—అందించి "దబ్బున తిని అడికిపోయి బ్యానర్ తీస్కోండి"

జనం తలలూపుతూ వుప్మాకాగితం అందుకుని

శివుని చేతిలో పొట్లం పడింది.... అమృతాన్ని పొందిన రాక్షసునిలా ఆనందంలో పుల్కితిబ్బిబ్బయి—

తిని.... గబగబా తిని....

త్రేన్చి.... వెళ్ళాడు బ్యాడ్జీలు పెడుతున్న చోటికి క్యూలో.

కుర్చీలో కూర్చున్న మనిషి చటుక్కున క్యూలోని మనిషి చొక్కా జేబు నందుకుని గుండు సూదితో బొమ్మ కాగితాన్ని గుచ్చి రాసిన అట్ట కట్టిన కట్టెను చేతికిస్తున్నాడు.

క్యూ వరుసగా కదులుతూ—

శివుని వంతు వచ్చింది

బ్యాడ్జీల వ్యక్తి... చటుక్కున ఒంటిపై చొక్కాలేని శివునివంక అసహ్యంగా ఉగ్రంగా

చూచి—కసిగా కాగితాన్ని చాతీపై నున్న తోలుపై ఉంచి గుండు సూదితో గుచ్చి—

క్షణంలో పదోవంతు కాలంలో—గుండు సూది చర్మంలో నుండి చొచ్చుకుని దిగి ...

"అమ్మా" అని అరిచాడు శివుడు

రక్తం ఎర్రగా బొట బొటా కారి....

చాతీపై నున్న మూడు రంగులు.. రక్తంతో తడుస్తూ

చేతికి ఓ అట్టనిచ్చి "పో బే" అని మెడబట్టి గెంటేశాడా వ్యక్తి.

గుండెలపై మంట.... మంట... ప్రాణం పోతున్నట్టుగా బాధ

నడుస్తున్నాడు శివుడు

ఎవరో ఏవో నినాదాలు చెబుతున్నారు వాటికి ప్రతిగా జనం ఏమని అరవాలో అతనే అరచి చూపిస్తున్నాడు

వెంట వెంటనే క్యూ తయారై —

ఊరేగింపు మొదలైంది.... ఒకరినొకరు తోసుకుంటూ నెట్టుకుంటూ, కుమ్ముకుంటూ... ఊరేగింపు.... సముద్రంలా ఊరేగింపు

"వీళ్ళందరికీ రూపాయలిచ్చే...." శివుడు. . అబ్బా... నొప్పి.... గుండెలపై గుండుసూది . తీసుకుందామా.... యింకెంత నొస్తుందో—

మూడు రంగుల జండా పూర్తిగా రక్తంతో తడిసిపోయింది. చేతిలోని అట్టనంక చూస్తే... ఏవో అక్షరాలు ...అవేమిటో తనకు తెలియవు తెలియని దానికోసం పోరాటం.... అరుపులు.... కేకలు.... బొబ్బలు

సాగుతోంది ఊరేగింపు—

ఉప్పెనలా.... తుఫానులా....

యీ లోపలే ఎక్కడో 'ధాం' అనిచప్పుడు.

అప్పటిదాకా వెంట నడుస్తున్న పోలీసులు చెల్లా చెదరై —

ఎక్కడినుండి పుట్టాయో మంటలు ... మంటలు....

మంటలు క్షణాల్లో వ్యాపిస్తూ—దుస్తులు. . యిండ్లు—కాలుతూ -

"మారో... మారో"

పక్క పక్క—ఎముకలు పగిలేలా.... కర్రలు స్వైర విహారం చేస్తూ—

"డిష్ం... డిష్ం"

తెల్లని పొగ—కళ్ళ మంటలు....

పరుగు ...పరుగు.... ఎవనికి తోచిన దిక్కు వాడు. తొక్కుకుంటూ.... తోసుకుంటూ.... అరుచుకుంటూ

బీభత్సం—

"మారో"—ఔర్ మారో"

యింకా తీవ్రత....

కకావికలై జనం—రాతిపై పడి చిట్లిన గాజు పలక ముక్కల్లా.

శివుడు ఉరుకుతున్నాడు... భయంతో

చేతిలో జండా.... గుండెపై గుచ్చుకున్న గుండుసూది

ఎవరో తోసేశారు....

క్రిందపడి... తొక్కుతున్నారు.. "అమ్మా. అయ్యో బాబూ... అమ్మా—"

పై నుండి వందల మంది.

"ఫైర్—"

ఢిష్షుం... ఢిష్షుం....

"అమ్మా...."

కేక....

శివుని కేక....



## వాస్తవికత

చిత్రకారుడు చిదంబరం ఓ అతివాస్తవిక చిత్రాన్ని గీసి స్నేహితుడైన డాక్టరు ధర్మారావుకి చూపెట్టాడు.

డా॥ ధర్మారావు ఓ గంట చిత్రాన్ని పరీక్షించి చివరికి ఆ చిత్రంలో వ్యక్తికి టి బీ వుందని తేల్చాడు

—ఎ. ఆర్. ప్రభావతి (విజయవాడ)

దిక్కులు పిక్కటిల్లేలా శివుని కేక—

గుండెలపై మూడు రంగుల జండాను అంటి పెట్టి ఉంచిన గుండుసూదిని తుపాకీ గుండు పెకలించి వేసి లోపలికి దూసుకుపోయి—

కేక గాలిలో గడ్డకట్టి—ఎర్రగా రక్తం కారుతూ

టప్ .. టప్.... టప్.... బొట్లు.... బొట్లు .... బొట్లు ధారగా కారి.... మడుగు—

* * *

కూలిపోబోతున్న గుడిసె ముందు—

చీకిపోయిన ముసల్దాని ముంగిట్లో—

కార్ల దండు వచ్చి ఆగింది

ఖరీదైన పెద్ద మనిషెవరో శివుడు అమరుడై పోయినందుకు ఆమెను ఓదారుస్తూ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాడు.

ఫోటో గ్రాఫర్లు టకటగా ఫోటోలు తీస్తున్నారు

ఆమె కదంతా ఏమిటో అర్థంకాలేదు.

అర్థం కాకముందే కార్లూ, కార్లలో ఖరీదైన వ్యక్తులూ వెళ్ళిపోయారు.

ఆమె....

ముడతలుపడ్డ కళ్ళతో—

అప్పుడే వండిన ముతక బియ్యపు అన్నాన్ని-గిన్నెలో ఉన్నదాన్ని శివునికోసం ఊహిస్తూ—

ఊరి చివరి తాటి తోపు అవతలి-తారురోడ్డు దిక్కు చూస్తోంది శివునికోసం.... రాని శివుని కోసం

చూస్తున్న ఆమె కళ్ళలో.

వెనుదిరిగి వెళ్తున్న కార్లు రేపిన దుమ్ము గుప్పున పడింది—

ఆమె కళ్ళనిండా.... దుమ్ము .. పూర్తిగా. ✱

## నో రెస్పాన్స్

